# భార్య

కె. ఆదర్శ సామ్రాట్

అతనికి అనుమానం-ఒకే ఒక్క అనుమానం!

హారితపైన అవ్యాజమైన అనురాగం జనించింది మొదలు, ఆమెతో కలిగిన బాంధవ్యం శాశ్వతంగా ఉండాలని ఆశించింది మొదలు, ఆమెకు తనపైన ఉన్న ప్రేమానురాగాలు ఏ క్షణంలోనూ, ఏ విధంగానూ చెదిరిపోకూడదని. మనసారా వాంఛించడం మొదలుపెట్టింది మొదలు-అదే అనుమానం!

ఏ క్షణం భూకంపం ప్రగర్భిస్తుందో, ఏ తుఫాను. ఈ మధురత్యాన్ని మార్చేస్తుందో, స్వర్గ తుల్యమైన ఈ జీవితాన్ని ఏ దుష్ట ఘడియ స్వప్నంగా చేసేస్తుందో-అని ఒకటే అనుమానం.


"సాయంత్రం తొందరగా రండి శ్రీ. మీరు రాకపోతే నా కేమీ తోచదు" అంటూ భార్య అనురాగం వర్షించే కళ్ళతో సాగనంపుతున్నప్పుడు ఒక వక్క గుండె నిండా ఆనందమూ, తృప్తీ నిండుకుంటున్నా మరో వక్క బెదురుగా ఆ పెట్టె వైపు చూసేవాడు.

దాని కున్న చెక్కు చెదరని తాళం అతనికి రిలీఫ్ కలిగించేది. మళ్ళీ సాయంత్రం ఇంటికి రాగానే భార్య ఆదరణలో కరిగిపోతూనే అనుమానంగా ఆ పెట్టె వైపు చూసేవాడు.

"మీ లాంటి భర్త దొరకడం నా అదృష్టం శ్రీ. నిజంగా మీరు నా అదృష్టం." అని హారిత గుండె నిండుగా ఆర్ద్రత నిండిన గొంతుతో అంటున్నప్పుడు-ఆమె అనురాగంలో కరిగి ప్రవహించిపోతూనే మధ్యలో అనుమానంగా ఆ పెట్టె వైపు చూసేవాడు.

ఆ పెట్టె తన పాలిటి భూతంలా కనిపించేది. అయినా దా న్నేమీ చేయలేకపోయేవాడు.

హారిత తీయని సాంగత్యంలో రోజులు దొర్లిపోతున్నాయి.



ప్రతి రోజూ హరితలో ఏదో కొత్తదనం, ఆమె ఆత్మీయతలో ఏ వెలితీ లేని ఒక నిండుదనం కనిపించేవి. దేవుడే దిగి వచ్చినా తమను ఏమాత్రం వేరు చేయలేడని గట్టిగా అనిపించేది.

అయినా అనుమానం అనుమానమే. అది మాత్రం మాసిపోయేది కాదు.

అసలు హరితతో పెళ్ళికి ముందుగా తను ఇష్టపడలేదు. తల్లి కన్నీళ్ళను చూడలేక అయిష్టంగానే ఒప్పుకున్నాడు.

పెళ్ళయిన రెండు నెలల వరకూ ఆమెతో అంటీ అంటనట్లుగా తిరిగాడు. మానసిక సంఘర్షణతో కుమిలిపోతూ ఉన్న ఆ సమయంలోనే సరిగ్గా న్యూమోనియా ఎటాక్ చేసింది.

రెండు నెలల వరకు తిరిగి మామూలు స్థితికి 'రాలేకపోయాడు. ఆ రెండు నెల్లలూ హరిత చేసిన సేవలు, పెళ్ళయినా స్త్రీ ఆశించే ఏ సుఖాలూ అందివ్వకపోయినా ఆమె తనపైని చూపించే అభిమానం-ఇవన్నీ అతన్ని సిగ్గుపడేలా చేశాయి. గతాన్ని మరిచిపొమ్మనీ, భవిష్యత్తును నిర్మించుకోమనీ అతనికి ఉద్బోధించేలా చేశాయి. ఆ క్షణం నుంచీ ఆతనిలో మార్పు మొదలయ్యింది.

పెళ్ళయిన కొత్తలో ఏ హరితనైతే అంటీ అంటనట్లుగా ఉంచేవాడో ఇప్పుడు ఆ హరితే అతని సర్వస్వమూ అయిపోయింది. హరిత లేనిదే తన జీవితానికి అర్థం లేదనీ, అసలు జీవితమే లేదనీ అనిపించసాగింది.

ఆమె ప్రేమ విలువ తెలుసుకున్నాడు కాబట్టే దాన్ని వదులుకోదలచుకోలేదు. దాని కోసం, ఆమె ప్రేమ కోసం దేన్నైనా వదులుకోడానికి సిద్ధపడుతున్నాడు. కాని... తమ ఇద్దరి ప్రేమకూ కనిపించని అగ్నిపర్వతంలా నిలిచిన ఆ భూతాన్ని ఎలా వదులుకోవాలో ఇంత కాలం అర్థం కాలేదు.

సరిగ్గా పెళ్ళయిద ఏడాదిన్నర తరువాత ఆ అవకాశం ఈ రోజు లభించింది.

హరితకు సీమంతం చేయాలని ఆ రోజే పుట్టింటివాళ్ళు తీసుకెళ్ళారు. మరో నాలుగు రోజుల వరకూ ఎట్టి పరిస్థితుల్లోనూ అతనికి సెలవు దొరకదు. అందుకే కూడా వెళ్ళలేకపోయాడు.

వదలలేక వదలలేక అత్త మామలతో హరితను సాగనంపాడు. మరో వారం రోజుల వరకూ ఆమెను చూడలేనన్న భావం అతన్ని కోత పెడుతూ ఉంది. ఇన్ని రోజులు ఆమెని వదిలి ఎప్పుడూ ఉండలేదు. వారం రోజు లుంటే అదొక ఏడు జన్మ ల్లాగా అనిపిస్తుంది. అన లా భావాన్నే సహించకలేకపోతున్నాడు.

భార్యకు వీడ్కోలు ఇచ్చి భారమైన హృదయంతో శ్రీచరణ్ ఇంటికి తిరిగి వచ్చాడు.

రాగానే పెట్టె రూపంలో భూతం కనిపించింది. తనను అనుక్షణం అనుమానంతో పీడిస్తున్న భూతం!

అల్మైరా తెరిచి అందులో తను రహస్యంగా దాచి ఉంచిన పెట్టె తాళంచెవి తీసుకున్నాడు. తాళం తెరిచి పెట్టె మూత తీస్తూ ఉంటే అతని చేతులు అదే పనిగా వణికాయి.

పెట్టె తెరిచాడే కాని చేతులు లోపలికి పోవడంలేదు. నిశ్చేష్టుడై కొన్ని క్షణాలు అలాగే ఉండిపోయాడు. తరువాత చేతి కందిన పుస్తకాన్ని తీసుకుని మధ్యగా తెరిచాడు.

ఒకనాటి తన ఆరాధ్య దేవత 'పరిమళ' ఫోటో అతని ఒడిలోకి జారిపడింది.

కొన్ని క్షణాలు తదేకంగా ఆ ఫోటో వంక చూస్తూ ఉండిపోయాడు.

యూనివర్శిటీలో చదివిన రోజులు-అప్పటి కలలు-ఆలోచనలూ-అన్నీ గిర్రున స్మృతిపథంలో మెదిలాయి.

పరిమళ!

ఒకా నొకప్పుడు తను బ్రతు క్కంటే గొప్పదని భావించిన అందాలరాశి పరిమళ! తన స్నేహాన్ని ప్రేమను తృణంలా తిరస్కరించిన పరిమళ!

అనిశ్చితంగా అతను డైరీలోకి చూశాడు.

"డిసెంబర్ 15, 1985:

పరిమళ కంటే పరిమళమైనదీ, సౌందర్య భరితమైనదీ ఈ ప్రపంచంలో ఏదీ లేదు. నాకు పరిమళ కావాలి. పరిమళ ప్రేమ కావాలి. పరిమళ సమస్తమూ నాదే కావాలి. పరిమళ లేకపోతే నేను బ్రతకలేను..."

"డిసెంబర్ 20:

"ఈ రోజు ప్రపంచ మంతా నాకు పరిమళమయంగానే కనిపిస్తోంది. పరిమళ తప్పించి ఇం కేదీ ఈ ప్రపంచంలో బ్రతికి లేదని అనిపిస్తుంది. అసలు నేను కూడా లేననీ-నా ఉనికి కేవలం పరిమళ ప్రతిబింబ మేననీ-ఏమిటో చెప్పలేని వింత అనుభూతి కలుగుతోంది. గది. గోడల్లో, రోడ్లలో, ఎదురయ్యే మనుషుల్లో, చెట్లలో, ఆకాశంలో-ప్రతిచోటా అణు వణువునా పరిమళ ప్రతిరూపమే కనిపిస్తోంది. పరిమళ తప్పించి ఇం కేదీ కనిపించడంలేదు. అద్వైతమని దీన్నేనా అంటారు?"

శ్రీచరణ్ చేతులు చక చకా డైరీలోని పేజీలను తిప్పుతున్నాయి. అతని కళ్ళు అంతకంటే వేగంగా అందులోని మధుర వాక్యాలను మననం చేస్తున్నాయి. ఒకటి పూర్తికాగానే మరొకటి తీసుకున్నాడు.

"జనవరి 1, 1986:


"కొత్త సంవత్సరం మొద లయ్యింది. కొత్త కొత్త ఆలోచనలతో, పథకాలతో అందరూ ముందుకు దూకుతారు. నాలో మాత్రం ఏ కొత్తదనమూ లేదు. నా ఆశలు, ఆశయాలు, కలలు-అన్నీ పరిమళ చుట్టూ గాఢంగా పెనవేసుకున్నాయి. ఆమె ఒక చిరునవ్వు నవ్వితే చాలు నా ఆశలన్నీ ఈడేరినట్టుగా అనిపిస్తుంది. ఆమె ఒక చిన్న మాట మాట్లాడితే చాలు నా కల లన్నీ సాఫల్యం చెందినట్లు అనిపిస్తుంది. పరిమళను చూసింది మొదలు అంటే ఆరు నెలల నుంచి ఈ రోజు వరకు పరిమళే నా సమస్త ఆలోచనలకు కేంద్ర మైపోయింది. ఈ రోజూ అంతే. నా సామ్రాజ్యానికి ఆమే ఏకైక రాణి. ఆమే సేనాధిపతి. మంత్రులూ తదితరులూ అన్నీ ఆమే! ఆమె స్థానం అచంచల మైనది..."

"ఫిబ్రవరి 3:

వారం రోజుల నుంచి పరిమళ నాకు కనిపించలేదు. మళ్ళీ ఈ రోజు చూశాను. ఆమె చిరునవ్వులో ఎన్నో వసంతాలు విరుకున్నాయో, ఎన్ని దివ్య గీతాలు పాడుకున్నాయో మాటల్లో రాసుకోలేను. ఆమెను చూడగానే వారం రోజుల ఆకలీ ఒకేసారి వేసింది. మెస్‌కి వెళ్ళి కడుపు నిండా తిని వచ్చాను. క్లాసు లన్నీ ఎగ్గొట్టి తోటలో ఒంటరిగా కూర్చుని, ఆకుల కదలిక వంకా, ఆకుల మధ్య నుంచి కనిపించే ఆకాశం వంకా... అప్పుడే కళ్ళు తెరిచిన పసిబిడ్డలా ఆనందంగా చూస్తూ ఉండిపోయాను."

"ఫిబ్రవరి 27:

ఈ మధ్య పరిమళ ప్రవర్తన చూస్తోంటే నాకు చాలా బాధగా ఉంది. ఇదివరకులా మనస్ఫూర్తిగా నాతో మాట్లాడడంలేదు. ఆమె ఎందుకు నా నుంచి దూరంగా తప్పుకుంటూంది? ఇదివరకు మాట్లాడినంత ఫ్రీగా ఇప్పు డెందుకు మాట్లాడడంలేదు? నా మనసులో ఏ ముందో ఇన్నాళ్ళూ ఆమెకు తెలియదా? ఇప్పుడే కొత్తగా తెలిసి అది ఇష్టం లేక ఇలా దూర మవ్వాలని చూస్తూ ఉందా? ఏమైనా కానీ పరిమళ ప్రవర్తన నన్ను చాలా బాధ పెడుతూంది."



"మార్చి 29:

నెల రోజుల నుంచి అనుకుంటున్నాను. పరిమళకు నా మనసులో మాట స్పష్టంగా చెప్పేయాలని. పరిమళ లేనిదే నేను బ్రతకలే నని కూడా చెప్పేయాలి. కాని ఎలా సాధ్యమౌతుం దది? రాత్రంతా కూర్చుని ఒక పెద్ద ఉత్తరం రాశాను. ఎంత ధైర్యం చేసినా కొన్ని కొన్ని నోటితో చెప్పలే మేమో! ఉత్తరం కూడా డైరెక్టుగా ఇవ్వలేకపోయాను. పరిమళ నోట్‌బుక్ తీసుకుని అందులో పెట్టి ఇచ్చేశాను. నిశ్చింతగా ఉంది. పరిమళ నాకు జీవితాంతం తోడుగా వస్తుందనీ, ఆ విషయం రేపే తన నోటితో చెబుతుందనీ సంతోషకరమైన ఊహలు మెదులుతున్నాయి."

"ఏప్రిల్ 5:

ఈ రోజు వరకు పరిమళ నాకు జవాబు చెప్పనేలేదు. అన లిన్ని రోజులూ క్లాసెస్‌కి రానేలేదు. ఈ వారం రోజులూ నే నెంత కుమిలిపోయానో, ఎలాంటి రంపపు కోత అనుభవించానో భగవంతుడికే తెలియాలి. పరిమళను చూడగానే నాకు ప్రాణం లేచి వచ్చింది. కానీ ఆమె మొహంలో ఎప్పటి లాంటి చిరునవ్వు లేదు. ఎన్నడూ లేనంత షాక్ తిన్నాను. తరువాత లీజర్‌లో ఒంటరిగా కూర్చున్నప్పుడు ఆమె చెప్పింది-తన పెళ్ళి రెండేళ్ళ క్రితమే ఫిక్స్ అయిపోయిందనీ, నే నింత మీన్‌గా ఎందు కాలోచించాననీ, అయినా ఈ ప్రేమతో ఇలాంటి వాటి మీద తనకు బొత్తిగా నమ్మకం లేదనీ... అరగంటసేపు ఆమె ఏమేమో చెబుతూనే ఉంది. నాకు మాత్రం ఏమీ వినిపించలేదు. పాతాళంలోకి ఒక్కసారిగా కృంగిపోతున్నట్లుగా అయిపోయింది. అన్నీ చెప్పి ఆమె వెళ్ళిపోయింది.

నేను మాత్రం తోటలోనే చాలాసేపు మౌనంగా కూర్చుండిపోయాను. ఏడ్వాలని కాని, చచ్చిపోవాలని కాని అనిపించలేదు. కొన్నాళ్ళ పాటు ఎక్కడి కైనా దూరంగా వెళ్ళిపోవాలని అనిపిస్తోంది..."

"జూలై 4:

మూడు నెలలు దేశమంతా తిరిగి వచ్చాను. ఎక్కడికి వెళ్ళినా సరే పరిమళ ఆలోచనలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆమె జ్ఞాపకాలు పైకి రాకుండా ఒక్క రోజైనా గడవడంలేదు. ఆమెని మరిచిపోవాలని ఎంతగా అనుకుంటున్నా బాధ-ఏమిటో చెప్పలేని బాధగా ఉంది. అసలు ప్రేమలోనే ఇలాంటి బాధ మిళితమై ఉంటుందా?... పరిమళ మాత్రం అప్పటికంటే అధికంగా నా హృదయాన్ని ఆక్రమించింది."

శ్రీచరణ్ మనస్సు డైరీలు చదువుతున్న కొద్దీ గతంలోకి జారిపోయి ఆ క్షణాలలో తాదాత్మ్యం చెందసాగింది.

దాదాపు రెండేళ్ళు-పరిమళ పరిచయమయ్యింది మొదలు తన పెళ్ళి నిశ్చయమయ్యే వరకు డైరీలు రాసుకున్నాడు. వాటిలోని ఏ పేజీ-ఏ లైనూ-పరిమళ ప్రసక్తి లేకుండా సాగలేదు. అసలు డైరీలు రాయడం మొదలుపెట్టిందే పరిమళతో. వాటిని ఆపేసింది మాత్రం తన పెళ్ళితో.

డైరీ లన్నీ కాల్చేయాలని బయటకు తీసిన శ్రీచరణ్ వా టన్నిటినీ చదవగానే ఆ ప్రయత్నం నుంచి విరమించుకున్నాడు. ఎప్పటి లాగే డైరీలన్నీ పెట్టెలో సర్దేసి మామూలుగా తాళం వేసేశాడు.

కెనడాడ్ అనే ఆయన 1974లో జూన్ 4వ తేదీన 'రాయల్ కోర్ట్ థియేటర్'లో ప్రేక్షకులను 3 గంటల 6 నిమిషాలు ఏకధాటిగా ఆపకుండా నవ్వించాడట.

చాగాపురం .నాగేశ్వరరావు.

మతిమరుపు ప్రొఫెసర్ తన ఫ్రెండుతో "ఇవాళ ఒక నిలువుటద్దం కొనాలి అనుకుంటున్నాను"

"నిలువుటద్దమా! ఎందుకూ!"

"నాకు అద్దంలో చూసుకుంటూ డ్రస్ చేసుకోవడం అలవాటు. మా ఇంట్లో నిలువుటద్దం లేకపోవడంతో ప్రతిరోజూ పాంటు తొడుక్కోవడం మర్చిపోతున్నాను".

- జీవి

ఎందుకో వాటిని కాల్చాలని అనిపించడంలేదు. వాటిని కాల్చడం తన మనస్సునీ, తన ప్రేమనీ తనకు తనే కాల్చుకోవడం అనీ అనిపిస్తూంది.

ఇన్నాళ్ళూ ఏ డైరీల నుంచి తననూ, తన భార్య ప్రేమనీ కాపాడుకోవాలని అనుకున్నాడో-తీరా వాటిని కాల్చే అవకాశం వచ్చేసరికి కాల్చలేకపోతున్నాడు.

ప్రతి రోజూ కాల్చాలని డైరీలన్నీ పైకి తీయడం-వాటిని చదివి కాల్చలేక మళ్ళీ పెట్టెలో పెట్టేయడం-ఆరు రోజులు వరుసగా అదే జరిగింది.

ఆ ఆరు రాత్రులూ అతనికి ఏ వేవో పీడ కలలు వచ్చాయి. చెమట కక్కుకుంటూ హఠాత్తుగా నిద్ర నుంచి లేచిపోసాగాడు.

ఒక వక్క ప్రేమదేవత లాంటి హరిత! మరో వక్క కుసుమ కోమలమైన తన భావాల పరిమళం! దేన్నీ వదులుకోలేకపోతున్నాడు.

ఇక తన భార్య తిరిగి వచ్చేందుకు ఒకే ఒక్క రోజు పై ముంది. మళ్ళీ ఈ అవకాశం తనకు దొరక్కపోవచ్చు. తల్లి కూడా తీర్థయాత్రలకు వెళ్ళింది.

ఆ రోజు ఖచ్చితంగా భార్య తిరిగి వచ్చే రోజు.

ఎలాగైనా సరే డైరీలను కాల్చేయాలని ప్రతి రోజు లాగే ఆ రోజు కూడా అతను పెట్టె ముందు కూర్చున్నాడు. కాల్చా లంటే మన సొప్పడంలేదు. ఎందుకో గాని పూలను మంటల్లో పడేసే ఫీలింగ్ కలుగుతూంది. సంఘర్షిస్తూ పెట్టె ముందే గంటలు గంటలు ఉండిపోయాడు. చివరకు మనసు గట్టిపరుచుకుంటూ అగ్గిపుల్ల వెలిగించి మొదటి డైరీని అంటబెట్టాడు.

అది కాలిపోతూ ఉంటే హృదయం పరపర మంటున్నట్లుగా అనిపించింది.

అది కాలగానే రెండోది తీసుకున్నాడు. దాని తర్వాత మూడోది. ఆఖరున నాల్గోది... ఎప్పుడు మొదలయ్యాయో కాని అతని కళ్ళు అదే పనిగా వర్షిస్తున్నాయి. తప్పదు. హరిత కోసం ఆ మాత్రం చేయక తప్పదు అని తనకు తను సర్ది చెప్పుకున్నాడు.

ఆఖరు డైరీ పూర్తిగా కాలిపోయే సమయానికి అతనికి తలుపు కొట్టిన చప్పుడు వినిపించింది.

రివ్వున పరిగెత్తి తలుపు తీశాడు. భార్యను చూడగానే గాఢంగా ఆమెను హృదయానికి హత్తుకొని తనివి తీరా చుంబించాడు

ఇక ముందు తమను ప్రపంచంలో ఏ శక్తీ విడదీయలేదు. తన గడచిన జీవితానికి సంబంధించిన సమస్త సాక్ష్యాలూ సమసిపోయాయి. సంతోషంతో, ఆవేశంతో, ఉద్వేగంతో మరింత గాఢంగా భార్యను హత్తుకున్నాడు.

ఏదో కాలుతున్న వాసన వస్తూ ఉంటే హరిత తన్మయత్వం నుంచి తేరుకుని కళ్ళు తెరిచింది.

తెరిచిన పెట్టె, దాని ముందు కాగితాలు కాలిన మసి కుప్ప కనిపించగానే ఆమె భర్తను విడిపించుకొని వేగంగా అక్కడకు పరిగెత్తింది. పెట్టెలో ఓ అర నిమిషం కిందా, మీదా వెతికి భర్త వైపు, మసి కుప్ప వైపు మార్చి మార్చి చూసి వణుకుతున్న గొంతుతో అడిగింది.

"ఇందులో... ఇందులో డైరీలు కాల్చేశారా?"

అతను పిడుగు పడ్డట్లు అదిరిపడ్డాడు. తడారిన గొంతు పెగుల్చుకుని ఎలాగో, "వాటి సంగతి... వాటి సంగతి నీకు తెలుసా హరితా?" అన్నాడు.

"అయ్యో తెలియకపోవడం ఏమి టండీ. మీ భార్యగా మీ గురించి సమస్త విషయాలు తెలుసుకోవడం నా విధి. తప్పైనప్పటికీ ఆ విధిలో భాగంగానే నేను మీ డైరీలు చదివాను.అయినా అంత అందమైన కావ్యాలు కాల్చడానికి మీకు మన సెలా ఒప్పిందండీ?"

"హరితా!"

"అవునండీ.మీ రేమిటో, మీ మన సేమిటో, అదెంత సున్నిత మైనదో, అందమైనదో నాకు మీ డైరీల వల్లే తెలిసింది. వాటిని చదివి ఉండకపోతే ఈ జన్మంతా గడిచిపోయినా మీరు నాకు అర్థమయ్యే వారు కాదు. మ నిద్దరినీ మానసికంగా కలిపినదీ, ఈనాడు మనిద్దరి మధ్య ఇంత చక్కటి అవగాహనను కలిగించినదీ ఈ డైరీ లేనండీ." ఆమె కాలిపోయిన మసి వంక చూస్తూ "ఒక్కటి కూడా మిగల్చలేదా?" అంది బాధగా.

అతను ఆ ప్రశ్నను ఆలకించనేలేదు. అతనికి తా నెక్కడో వేరే లోకంలో ఉన్నా నన్న అనుభూతి కలుగుతోంది.

ఆమె మసి వంక బాధగా చూస్తూ మళ్ళీ అంది.

"ఎంత అందమైన ఊహలు! ఎంత అద్భుతమైన అనుభూతులు! ఎంతటి దివ్యమైన మనోభావాలు! మళ్ళీ రావు కదా." ఆ మాటలు అంటూ ఉంటే ఆమె గొంతు గద్గదమై కళ్ళు జల జలా వర్షించాయి.

అతను కలలోంచి నడిచినట్లుగా భార్యను సమీపించాడు. ఆమెకు చేయి అందించి పైకి లేపాడు. ఆమెకు ఏదో చెప్పాలని అనుకున్నాడు. కాని గొంతు నుంచి మాట రాక గాఢంగా ఆమెని తన హృదయానికి హత్తుకున్నాడు.

"హరితా! పోయింది కేవలం నా డైరీలు మాత్రమే. కానీ నా కీ రోజు ఒక అద్భుతమైన సత్యం తెలిసింది. ఒక నిజమైన భార్య ఎలా ఉంటుందో ఈ రోజే నాకు మొట్టమొదటిసారిగా తెలిసింది. నా జీవిత మంతా కలిపి చూసినా ఈ క్షణం నేను పొందుతున్న అనుభూతిని పొంది ఉండలేదు. చాలు హరితా ఇంతకు మించిన గొప్ప అనుభూతి ఇంకొకటి ఉంటుందని నేను అనుకోవడంలేదు. నువ్వు నా అదృష్టానివి. నిజంగానే నువ్వు నా అదృష్టానివి. హరితా, నువ్వు నా అదృష్టానివి."

ఆ ఆఖరి మాట మాత్రమే హరితకు అస్పష్టంగా వినిపించింది. ✱